క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మియాపూర్: మయూరినగర్ కాలనీలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రఘుకాంత్, డాక్టర్ విక్రమ్ కిషోర్ రెడ్డిలు కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, మెడికవర్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గం: ఖాజాగూడలోని జైన్స్ కార్ల్‌టన్ క్రీక్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ తన మొట్టమొదటి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించింది. నూతన కార్యక్రమాన్ని ఆదివారం ప్రకటించారు. ఈ ఎన్నికలను 1964 తెలంగాణ కో ఆపరేటివ్ సొసైటీస్ చట్టం ప్రకారం నియమించబడిన ఎన్నికల అధికారి పర్యవేక్షణలో జరిగాయి. ఈ ఎన్నికలలో మొత్తం 11 డైరెక్టర్ స్థానాల్లో 9 స్థానాలు సభ్యుల మెజార్టీ నిర్ణయం ద్వారా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. మిగిలిన రెండు స్థానాలు సొసైటీ నిబంధనల ప్రకారం త్వరలో భర్తీ చేయాలని నిర్ణయించారు. మొదటి మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడిగా రాహుల్ పట్వా, ఉపాధ్యక్షుడిగా దీపక్ మత్రిపూడి, కార్యదర్శిగా అశ్విన్ కుమార్‌దొంతులా, జాయింట్ సెక్రెటరీగా రమేష్‌యేలం, కోశాధికారిగా నీరజశ్రీరామోజి, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా కల్లూరి అమరేంద్ర రెడ్డి, దూస కవిత, కె కళ్యాణ చక్రవర్తి, కిరణ్‌పట్వా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రాహుల్‌పట్వా మాట్లాడుతూ..కొత్త కమిటీ పారదర్శకత, సమగ్రత, బాధ్యతతో పనిచేసి కమ్యూనిటీ అవసరాలను తీర్చడం, సౌకర్యాలను మెరుగుపర్చడమే విధిగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. సొసైటీని బలోపేతం చేయడానికి సమష్టిగా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

చైల్డ్ వెల్ఫేర్ సొసైటీ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ

మియాపూర్: భారతదేశం 2047 సంవత్సరం వరకు మూడవ ప్రపంచ బలమైన ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతుందని హరియాణా రాష్ట్రం మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నాయకుడు బండారు దత్తాత్రేయ అన్నారు. మియాపూర్ దీప్తిశ్రీనగర్ కాలనీలోని ధర్మపురి క్షేత్రంలో ద చావడి చైల్డ్ వెల్ఫేర్ సొసైటీ 20వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బండారు దత్తాత్రేయ, సినీ నటులు నారా రోహిత్, ఫౌండర్ చైర్మన్ సాయిబాబులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ..దీప్తిశ్రీనగర్ కాలనీలో ధర్మపురి క్షేత్రం చెట్ల మధ్యలో అడవిలాంటి ప్రాంతంలో ఉండేదని ఈ క్షేత్రాన్ని నిర్వాహకురాలు సత్యవాణి ఆధ్వర్యంలో ఎంతో గొప్పగా అభివృద్ధి చేసిందన్నారు. చిన్న పిల్లలను అన్ని రంగాల్లో అధునాతన, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఇంగ్లిష్ నేర్పించి ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న చైల్డ్ వెల్ఫేర్ సొసైటీ సేవలు అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ధర్మపురి క్షేత్రం నిర్వాహకురాలు భారతీయం సత్యవాణి, రక్షిత్ అండ్ సాయినూర్ గ్రూపు చైర్మన్ రామేశ్వర్ రావు, వెంకటారెడ్డి, వెంకటేశ్వర్ రావు, రన్‌వీర్ వీరేశ్వర్ రావు, చంద్ర మౌలేశ్వర్ రెడ్డి, కిరణ్ , రామ్ ప్రియాంక, గోవిందరాజులు, ఎల్ఎన్‌రెడి, రాజ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభోత్సవం చేయనున్నారు. పీఆర్‌నగర్‌లో నీటి సంపు ఏర్పాటు, ప్లంబింగ్ పనులు, యూపీహెచ్‌సీ దవాఖానాకు 10 లక్షల నిధులు, అవంతి నగర్ తోట కమ్యూనిటీ హాల్ షెడ్ ఏర్పాటు రూ.20 లక్షలతో, లేయింగ్ ఆఫ్ సీసీ రోడ్డు పలుచోట్ల కబీర్‌నగర్, బబ్బుగూడ పనులకు రూ.20 లక్షలు, కబీర్‌నగర్ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు రూ.26 లక్షలు, లేయింగ్ ఆఫ్ సీసీ రోడ్డు, స్నేహపురి కాలనీ మోతీనగర్ చౌరస్తాలో రూ.20 లక్షలు, బీఎస్‌పీ కాలనీ పార్కులో జిమ్ పరికరాల ఏర్పాటు, టాయిలెట్స్ మరమ్మతుల పనులకు రూ.15 లక్షలతో పనులకు ప్రారంభం, ఉదయం 10.30 గంటలకు ఓల్డ్ బోయిన్‌పల్లి భాగ్యశ్రీ గార్డెన్‌లో ఉచిత వైద్య శిబిరం, రక్త దాన శిబిరం కార్యక్రమాల్లో పాల్గొనున్నట్లు తెలిపారు.

ఖాజాగూడలో రూ. 100 కోట్ల విలువైన స్థలం కబ్జా

- తూతూ మంత్రంగా రెవెన్యూ అధికారుల చర్యలు
- నకిలీ పత్రాలు సృష్టించి సర్వే నెంబర్ 40లో పాగాకు యత్నం
- పొజిషన్‌లో లేకున్నా జీ.ఓ.59లో దరఖాస్తు
- రక్షణ చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ విఫలం


ఖాజాగూడ సర్వే నెంబర్ 40లో ప్రభుత్వ స్థలం ఇదే..

గచ్చిబౌలి: వంద కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాదారులను సొంత చేసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు మీనామేశాలు లెక్కిస్తున్నారు. పైపై చర్యలతో అడ్డుకున్నట్లు నటిస్తున్నపటికీ ఫెన్సింగ్ వేయకుండా కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖాజాగూడ సర్వే నెంబర్ 40లో నకిలీ డాక్యుమెంట్లతో ఇప్పటికే చాలా భూమి కబ్జాదారులు ఆక్రమించి అమ్మేసుకున్నారు. రోడ్డు విస్తరణ పేరిటి జరిగిన తంతు అంతులేని అవినీతి చోటు చేసుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. శేరిలింగంపల్లి మండల రెవెన్యూతో పాటు ఉన్నతాధికారులు దృష్టిసారించకపోతే అత్యంత విలువైన స్థలం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం పొంచిఉంది.

విఫల యత్నం...

ఖాజాగూడ సర్వేనెంబర్:40లో చిత్రపురికాలనీకి వెళ్లే రోడ్డును ఆనుకొని ప్రభుత్వ స్థలం ఉంది. అక్కడ చదరపు గజం ధరం రూ.2 లక్షలకు పైగానే ఉంటుంది. ఇద్దరు వ్యక్తులు కబ్జాకు యత్నించగా 2022లో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలమని బోర్డులు పాతి ఫెన్సింగ్ వేశారు. నకిలీ డాక్యుమెంట్లతో జీహెచ్‌ఎంసీ నుంచి పొందిన భవన నిర్మాణ అనుమతులను రద్దు చేశారు. దాదాపు రూ.20 కోట్ల విలువైన వెయ్యి చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించేందుకు ఇటీవల ఇద్దరు వ్యక్తులు రాళ్లు కొట్టి నేలను చదును చేశారు. రోడ్డు విస్తరణ పేరిట ఉన్న పట్టాలను కొనుగోలు చేయడం, ఎక్కడ పడితే అక్కడ పొజిషన్‌లోకి వెళ్లడం జరుగుతోంది. రోడ్డు విస్తరణలో ఉన్న పట్టాలు సైతం గతంలో బాధితుల జాబితాలో లేని వారి పేర్లతో పుట్టుకొచ్చాయి, తీసుకున్న బాధితుల పేరిటనే మళ్లీ మళ్లీ తీసుకునేందుకు యత్నించడం గమనార్హం. కబ్జాదారులు కోర్టులను ఆశ్రయిస్తే రెవెన్యూ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంతో నకిలీల దందా కొనసాగుతోంది. ఖాజాగూడ సర్వే నెంబర్ 40లో చిత్రపురి కాలనీ కమాన్ ఆనుకొని మేడు వేల చదరపు గజాలకు పైగా ప్రభుత్వ స్థలం ఉంది. అక్కడ ఒకే ఒక్క కుటుంబం ఉన్నట్లు చిన్నపాటి రేకుల పాక ఉంటుంది. కొందరు బడాబాబులు పొజీషన్‌లో లేని లబ్ధిదారులను సృష్టించి రెవెన్యూ అధికారుల సహకారంతో జీఓ నెంబర్:59లో దరఖాస్తు చేసుకున్నారు. ఆ స్థలం విలువ దాదాపు రూ.80 కోట్లు ఉంటుంది. ఆ రెండు చోట్ల రెవెన్యూ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి విడతలో తీసుకొచ్చిన జీఓ నెంబర్ 58, 59లో సర్వే నెంబర్ 40లో క్రమబద్ధీకరించారు. లబ్ధిదారులు ఇప్పటికే భవనాలు నిర్మించారు. నిర్మాణాలను పూర్తయినప్పటికీ రెవెన్యూ అధికారులు మాత్రం వారిని వదలడం లేదు. ఖాళీ స్థలాన్ని కాపాడడంలో నిర్లక్ష్యం ఎందుకు ప్రదర్శిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.


ప్రభుత్వ స్థలం అని పాతిన హెచ్చరిక బోర్డును జరిపి చెట్లలో పాతిన కబ్జాదారులు

హారతి కర్పూరంలా..

శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలోని సర్వే నెంబర్:40లో 7 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. రాయదుర్గంలో రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయిన బాధితులకు పట్టాలు పంపిణీ చేసి స్థలం కేటాయించారు. బాధితులకు కేటాయించగా మరో ఎకరం స్థలం ఖాళీగా ఉంది. ఖాళీ స్థలం కాజేసేందుకు నకిలీ డాక్యుమెంట్లు పుట్టుకొస్తున్నాయి. రోడ్డు విస్తరణ పేరిట కేటాయించిన పట్టాలతో ఓ వ్యక్తి అనేక చోట్ల స్థలం కాజేశాడు. అతనిపై రాయదుర్గం పీఎస్‌లో కేసులు నమోదయ్యాయి. ఆ వ్యక్తితో పాటు మరో వ్యక్తి వెయ్యి గజాల స్థలాన్ని కాజేసేందుకు ప్రయతిస్నిస్తున్నారు. ఇటీవల స్థలానికి రేకులు వేయగా రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. చదును చేసిన చోట ప్రభుత్వ స్థలం అని ఉన్న హెచ్చరిక బోర్డును కబ్జాదారులు పక్కనున్న ఖాళీ స్థలంలోకి మార్చారు. అయిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రెవెన్యూ అధికారుల తీరు విమర్శలు నెలకొన్నాయి.

విచిత్ర పరిస్థితి..

ఐటీ కారిడార్ రాకతో శేరిలింగంపల్లి మండలంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ భూములు కబ్జాదారులకు అందుబాటులో ఉంటున్నాయి. కాని ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రం దొరకడం లేదు. శేరిలింగంపల్లి మండలం నుంచి రాష్ట్ర ఖజాకు ఎక్సైజ్ శాఖ నుంచి భారీ ఆదాయాన్ని సమకూర్చుతోంది. అయినా దశాబ్దాలుగా శేరిలింగంపల్లి ఎక్సైజ్ కార్యాలయం శిథిలమైన అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఇటీవల ఏర్పడిన కొండాపూర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ హఫీజ్‌పేట్‌లో అద్దె భవనంలో కొనసాగడం గమనార్హం. ఆక్రమణకు గురైన స్థలాలను గుర్తించి ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయిస్తే బాగుంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. చిత్రపురి కమాన్ పక్కన ఉన్న 3000 వేల గజాల స్థలం అమ్మకానికి మార్కెట్‌లో పెట్టారని, సదరు స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఖాజాగూడ సర్వే నెంబర్:40లో ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి ఆర్ఐ చంద్రారెడ్డి తెలిపారు. వెయ్యి గజాల స్థలంలో వెలసిన రేకులను కూల్చామని తెలిపారు. పట్టాలు ఉన్నప్పటికీ సరిహద్దులు మ్యాచ్ కావడం లేదన్నారు. మిగిలిన మూడు వేల గజాల ఖాళీ స్థలాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

దేవుని మాన్యంలో రాత్రికి రాత్రే సిమెంట్ రోడ్డు

తొలగించిన దేవాదాయ శాఖ అధికారులు


అక్రమంగా వేసిన రోడ్డును తొలగించిన అధికారులు

గచ్చిబౌలి: దేవుని మాన్యంలో రాత్రికి రాత్రే సిమెంట్ రోడ్డు వేశారు. దేవుని మాన్యం ఆక్రమణకు గురవుతుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో దేవాదాయ శాఖ అధికారులు రోడ్డును పూర్తిగా తొలగించారు. గోపన్‌పల్లిలోని పురాతన రంగనాథ స్వామి ఆలయం మాన్యం సర్వే నెంబర్:268లో 13 ఎకరాల స్థలం ఉంది. దేవుని మాన్యంను ఆనుకొని సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ ఉంది. గెటెడ్ కమ్యూనిటీ నిర్మాణం చేపడుతున్న ఓ నిర్మాణ సంస్థ శనివారం రాత్రి సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టింది. దేవుని మాన్యం ఆక్రమించి సిమెంట్ రోడ్డును వేశారని గోపన్‌పల్లి వాసులు దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, ఈఓ సత్యచంద్రారెడ్డి అక్రమంగా వేసిన రోడ్డును పరిశీలించారు. డయల్ 100కు కాల్ ఫిర్యాదు చేశారు. ఆదివారం సిమెంట్ రోడ్డును తొలగించి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివకుమార్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రోడ్డు వేసిన వారిని గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

'యాత్రాదానం'లో అందరూ భాగస్వాములు కావాలి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో 'యాత్రాదానం'పేరిట ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించిందని, దీంట్లో అందరూ భాగస్వాములు కావాలని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ వెంకటేష్ ఆదివారం సూచించారు. సమాజంలో ఔత్సాహికులు పలు రకాల దానాలు చేస్తూ ప్రజలకు సేవ చేయాలని ముందుకొస్తుంటారని ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా యాత్రాదానంలో అనాథలకు, నిరాశ్రయులైన వృద్ధులకు, దివ్యాంగులు, పాఠశాల విద్యార్థులు, సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులు గురుకులాల్లో చదివే పేద విద్యార్థులకు విజ్ఞాన విహారయాత్రలు, పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలు సందర్శించడానికి వివిధ రకాల ప్యాకేజీలను ఉన్నతాధికారుల ఆదేశంపై ఆర్టీసీ హెచ్‌సీయూ డిపో అమలు చేస్తోందని వివరించారు. ఔత్సాహిక ప్రజా ప్రతినిధులు, ఎన్నారైలు, కార్పొరేట్ సంస్థలు, ఎన్జీఓలు, లయన్స్ క్లబ్, వివిధ రకాల స్వచ్ఛంద సేవా సంస్థలు ఈ యాత్రాదానం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. యాత్రాదానం ప్యాకేజీలు, ఇతర వివరాలు తెలుసుకొనుటకు హెచ్‌సీయూ డిపో ఇన్‌చార్జి మేనేజర్: 99592 26132, ట్రాఫిక్ సూపరింటెండెంట్ లక్ష్మీభాయి: 9948082462లో సంప్రదించాలని ఆయన సూచించారు.

శేరిలింగంపల్లి డివిజన్ అభివృద్ధే ధ్యేయం


పాపిరెడ్డినగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పాపిరెడ్డినగర్‌లో చేపట్టే అభివృద్ధి పనుల ప్రాంతాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ..పాపిరెడ్డినగర్ లింక్ రోడ్డు పనులను త్వరితగతిని చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద 5 దశాబ్దాలుగా ఉన్న సమస్యను ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సహకారంతో పరిష్కరించానని, అదే విధంగా పాపిరెడ్డినగర్ అండర్ బ్రిడ్జి వద్ద సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పాపిరెడ్డినగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో ర్యాంపుల తొలగింపులో స్థానికులు సహకారం అందిస్తే రోడ్లు విశాలంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ భాస్కర్, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌గౌడ్, సందయ్యనగర్ కాలనీ అధ్యక్షులు బసవరాజ్, కాలనీవాసులు కుమార్, విజయ్, ఖాసీం, కొండల్‌రావు, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వివరించండి



జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పట్టణ పరిధిలోని బీజేపీ అధ్యక్షుడు ఐలేష్ ఆధ్వర్యంలో ఆదివారం సేవా పక్షం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ నాయకులు నర్సింగ్ రావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలు ప్రజలతో స్నేహభావంతో మెలగాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు రవీందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈదులనాగులపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 2014-15 బ్యాచ్ 10వ తరగతి పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ప్రవీణ్ కుమార్, సురేష్, సాయి, కవిత, సౌజన్య, హారిక తదితరులు పాల్గొన్నారు.


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నేడు మెగా ఉచిత వైద్యం, రక్తదాన శిబిరం

ఓల్డ్ బోయిన్‌పల్లి: మన్నె గణేష్ యాదవ్ జ్ఞాపకార్థం ఉచిత వైద్యం, రక్తదానం శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బోయిన్‌పల్లి వ్యవసాయ కూరగాయల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మన్నె ఉదయ్‌యాదవ్ తెలిపారు. సోమవారం భాగ్యశ్రీ గార్డెన్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాఘవేంద్ర హాస్పిటల్, మిత్ర బ్లడ్ సెంటర్ సహకారంతో శిబిరం కొనసాగుతుందన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ నర్సింహ యాదవ్ హాజరవుతారన్నారు.



'సర్క్యులర్ ఎకానమీ ప్రత్యేక సెల్' ఏర్పాటుకు చర్యలు

- 'ఎస్కీ'క్యాంపస్‌లో సోమవారం ప్రారంభించేందుకు మార్గం సుగమం
- సర్క్యులర్ ఎకానమీ రంగంలో 'ఎస్కీ'
- ఒక ఆలోచనా కేంద్రంగా తయారుచేయడమే లక్ష్యం
- 'ఎస్కీ'డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు వెల్లడి

సాంకేతిక ఆవిష్కరణల ద్వారా వ్యర్థాల నిర్వహణపై నిర్వహించిన సదస్సు ఆధారంగా గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ప్రత్యేక 'సర్క్యులర్ ఎకానమీ సెల్'ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు'ఎస్కీ'డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వరరావు శనివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ సెల్‌ను సోమవారం 'ఎస్కీ'క్యాంపస్‌లో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. మా క్యాంపస్‌లో ఇటీవల నిర్వహించిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న వ్యక్తులు సమర్పించిన పేపర్ల ఆధారంగా ఈ సెల్ ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని నియమించాలని సంకల్పించినట్లు ఆయన వివరించారు. రాయదుర్గం


'ఎస్కీ'డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు

జంట నగరాల్లో రోజుకు ఎంత మేరకు సాలిడ్ వేస్ట్ ఉత్పత్తి అవుతోంది.?

కేవలం మన జంటనగరాల్లోనే రోజుకు 8 నుంచి 9 వేల మెట్రిక్ టన్నుల మున్సిపల్ సాలిడ్‌వేస్ట్ ఉత్పత్తి అవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 116 బిలియన్ టన్నుల వ్యర్థాలు పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయని గణంకాలు చెబుతున్నాయి. భవిష్యత్తులో వ్యర్థాల నిర్వహణ కేవలం సర్క్యులర్ ఎకానమీ ద్వారా మాత్రమే నివారించవచ్చు.

వ్యర్థాలపై ప్రజల్లో ఎలా అవగాహన కల్పిస్తారు.?

సర్క్యులర్ ఎకానమీ సెల్ ద్వారా అవగాహన కార్యక్రమాలను ఒక్కోసారి ఒక్కో రంగానికి చెందిన వారికి అవగాహన కల్పిస్తే కొంతలో కొంతైనా సాధ్యపడే అవకాశం లేకపోలేదు. ఈ కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తాం.

ఈ వ్యర్థాలపై ఎవరెవరితో కలిసి పనిచేస్తారు.?

ఈ వ్యర్థాల నివారణలో పరిశ్రమలు, కర్మాగారాలు, విద్యా సంస్థలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేసన్లు, పాఠశాల, కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థల కోసం మేధావి వర్గానికి చెందిన వారితో ఒక ప్రత్యేక సిలబస్ రూపొందిస్తాం. వివిధ యూనివర్సిటీల్లో ఈ రంగంలో పనిచేస్తున్న ఫ్యాకల్టీలతో శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, నాలెడ్జ్ షేరింగ్ సెషన్లు రూపొందించడం తద్వారా పెద్ద ఎత్తున అవగాహన, శిక్షణ అందించి వారి సామర్థ్యాన్ని పెంపొందిస్తాం. ఈ వర్గాల వారితో కలిసి పనిచేసేలా ప్రణాళిక రూపొందించిన అమలు చేస్తాం.

ఎలాంటి సూచనలు, సలహాలు ఇస్తారు.?

కేవలం శిక్షణ మాత్రమే కాకుండా ఘన వ్యర్థాలకు సంబంధించిన ప్రధానంగా స్క్రాప్ మెటల్, ఈ వేస్ట్, లిథియం-అయాన్ బ్యాటరీలు, సోలార్ ప్యానెల్స్, ప్రమాదకర పరిశ్రమ వ్యర్థాలు, వాడిన నూనె, వ్యవసాయ వ్యర్థాలు, టైర్లు, రబ్బర్ రీసైక్లింగ్, నిర్మాణ కూల్చివేత వ్యర్థాలు, గనుల తవ్వకంతో వచ్చే వ్యర్థాలు, వాడిన వాహనాల వ్యర్థాలు ఇంకా కోట్లాది టన్నుల ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాల వంటి రంగాల్లో సర్క్యులర్ ఎకానమీ ప్రాక్టీసులపనై పరిశోధనలు, కన్సల్టెన్సీ ప్రాజెక్టులు చేపడుతాం. ఆయా రంగాల్లో పనిచేస్తున్న జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సహకారం , ప్రభుత్వం, వృత్తి సంబంధ సంస్థలకు విధాన పరమైన సలహాలు, సాంకేతిక సూచనలు కూడా అందిస్తాం. ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టినా ప్రజల్లో మార్పు వస్తే వ్యర్థాల నియంత్రణ చాలా వరకు సాధ్యం.

ఈ రంగంలో 'ఎస్కీ'ని ఎలా అభివృద్ధి చేయాలని సంకల్పించారు.?

సర్క్యులర్ ఎకానమీ రంగంలో ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాను ఒక ఆలోచనా కేంద్రంగా, థాట్ లీడర్‌గా, ఒక కెపాసిటీ బిల్డింగ్ కేంద్రంగా పనిచేసేలా తయారు చేస్తాం. సస్టైనబిలిటీ డెవలప్‌మెంట్ గోల్స్ సాధించడంలో తోడ్పాటు, ఆవిష్కరణ, పర్యావరణ పరిరక్షణ, నేషన్ బిల్డింగ్‌పై నిబద్ధతగా వ్యవహరిస్తుంది.

రోడ్లు ధ్వంసం.. ప్రయాణికుల ఇక్కట్లు


గుంతల్లో ప్రయాణిస్తున్న వాహనాలు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల పట్టణాల పరిధిలో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మారుమూల గ్రామాల రోడ్లు సైతం అస్తవ్యస్తంగా మారడంతో ప్రయాణం నరకంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. జిన్నారం పట్టణ పరిధిలోని శివనగర్, గడ్డపోతారం పట్టణ పరిధిలోని మాదారం, గుమ్మడిదల పట్టణ కేంద్రం నుంచి కానుకుంట వరకు రోడ్ల దుస్థితి దారుణంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రోడ్లపై చినుకు పడిందంటే చిత్తడిగా మారుతున్నాయి. దీంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు అనునిత్యం ఈ రోడ్డుగుండా ప్రయాణం సాగించలేక పోతున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి రోడ్లు ధ్వంసమైన పట్టించుకునే నాథుడేలేదని మండిపడుతున్నారు. సమస్యపై సంబంధిత మున్సిపల్ అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకున్న దాఖాలా లు లేవన్నారు. ప్రయాణ వెతలు ఎప్పుడు తీరుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక, మున్సిపల్ అధికారులు రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.